క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ

తిప్పర్తి : పెద్ద సూరారం గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ అధికారి, ప్రస్తుతం కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బండారి నర్సింహ తన కుమార్తె బండారి మేఘన జ్ఞాపకార్థం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఎస్ఐ సాయి ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చేవారు వేసవిలో తాగు నీటికి ఇబ్బంది పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ లింగయ్య, సిబ్బంది ఉన్నారు.

'సోనియా, రాహుల్‌పై చార్జిషీట్ దారుణం'

కేతేపల్లి: నేషనల్ హెరాల్డ్ అంశంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఈడీ చార్జిషీటులో చేర్చడం దారుణమని, ఇది ముమ్మాటికీ రాజకీయ ప్రతీకార చర్య అని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ అన్నారు. గురువారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

శాలిగౌరారం: మండలంలో శుక్రవారం నుంచి మే 12 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి శరణ్య తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం ముందస్తు చర్యల్లో భాగంగా టీకాలు వేసేందుకు గ్రామాల వారీగా షెడ్యూల్ చేశామన్నారు. పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు.

వంట పాత్రలు అందజేత



వంట పాత్రలు అందజేస్తున్న ఎంఈఓ

మర్రిగూడ : మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అందజేస్తున్న వంట పాత్రలను ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్రిగూడ మండల వ్యాప్తంగా ఒక ఆదర్శ, ఐదు జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు మొత్తం 28 ఉన్నాయని, వంట పాత్రలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి, మర్రిగూడ హెచ్‌ఎం కళా శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

మునుగోడు: ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మునుగోడు గ్రామ శివారులో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడపూర్ గ్రామానికి చెందిన బండా మహేందర్ రెడ్డి తన ద్విచక్రవాహనంపై మునుగోడు నుంచి గూడపూర్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో ఎదురుగా కట్టెలోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో మహేందర్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే సంఘటన స్థలానికి వచ్చి 108 సాయంతో చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దైద నాగరాజుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న దైద నాగరాజు

నార్కట్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన దైద నాగరాజుకు అమెరికాకు చెందిన సంస్థ డాక్టరేట్ అందించింది. నాగరాజు చేస్తున్న సమాజ సేవను గుర్తించిన అమెరికాకు చెందిన సంస్థ డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ టాక్సెస్ వారు ఇన్ సోషల్ సర్వీస్ విభాగంలో డాక్టరేట్ ప్రకటించారు. హైదరాబాద్‌లో తెలంగాణ సాంస్కృతిక చైర్ పర్సన్ డాక్టర్ జీవీ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా గురువారం నాగరాజు డాక్టరేట్ అందుకున్నాడు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తాను చేస్తున్నసేవా కార్యక్రమాలు గుర్తించి డాక్టరేట్ అందజేశారని తెలిపారు. తనకు డాక్టరేట్ వచ్చేందుకు సహకరించిన డాక్టర్ ఎంవీ ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'పీఎం శ్రీ'తో పాఠశాలకు మహర్దశ!

- కేంద్ర ప్రభుత్వ పథకానికి తిప్పర్తి జెడ్పీహెచ్‌ఎస్ ఎంపిక
- విద్యార్థులకు సమకూరనున్న వసతులు



తిప్పర్తి ఉన్నత పాఠశాల

తిప్పర్తి : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ కృషి చేస్తోంది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి వాటికి నిధులు మంజూరు చేసి విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పిస్తోంది. అందులో భాగంగా తిప్పర్తి జెడ్పీహెచ్‌ఎస్‌ను పీఎం శ్రీ (ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి ఎంపిక చేశారు.

373 మంది విద్యార్థులు..

పీఎం శ్రీ పథకానికి ఎంపిక కావడానికి ప్రధానంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటారు. పాఠశాలలో మౌలిక వసతులు, విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ నిర్వహణ, ప్లే గ్రౌండ్, కాంపౌండ్ వాల్, ఆడపిల్లలకు రక్షణ, సేఫ్టీ జోన్, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీల నిర్వహణ ఆధారంగా తీసుకొని సంబంధిత జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం సెంట్రల్ టీం వీడియోలను ఆన్‌లైన్‌లో పరిశీలించి పాఠశాలకు గ్రేడింగ్ ప్రకటిస్తుంది. తిప్పర్తి పాఠశాలలో 373 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాల హెచ్‌ఎం పీఎం శ్రీ పథకానికి దరఖాస్తు చేశారు. తిప్పర్తి ఉన్నత పాఠశాలకు పరిశీలనలో 75 శాతం మార్కులు రావడంతో 2024–25లో సంవత్సరంలో పీఎం శ్రీ పథకానికి ఎంపికైంది. ఈ పథకం ద్వారా నాలుగు సంవత్సరాలపాటు తిప్పర్తి పాఠశాలకు కేంద్రం నుంచి నిధులు అందనున్నాయి. తిప్పర్తి పాఠశాల పీఎం శ్రీ పథకానికి ఎంపిక కావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలకు కలిగే ప్రయోజనాలు

తిప్పర్తి ఉన్నత పాఠశాల పీఎం శ్రీ పథకానికి ఎంపిక కావడంతో పాఠశాలకు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రూ.6 లక్షలు మంజూరు చేసింది. మెయింటెనెన్స్, స్టేషనరీ, టూర్స్, వైజ్ఞానిక ప్రదర్శన, క్షేత్రస్థాయి పర్యటనలు, సైన్స్ సర్కిల్, మ్యాథ్స్ సర్కిల్, బోధన ఉపకరణాలు, పాఠశాలకు కంప్యూటర్ విద్యకుగాను కంప్యూటర్‌లను కొనుగోలుకు ఈ నిధులు వినియోగించాలి. ప్రస్తుతం ఈ నిధులతో పాఠశాలకు 70 బెంచీలు, 12 కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్ కోసం మెటీరియల్ కొనుగోలు చేశారు. గతంలో కూడా తిప్పర్తి పాఠశాల రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైంది.

అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం

తిప్పర్తి బాలుర ఉన్నత పాఠశాల పీఎం శ్రీ పథకానికి ఎంపిక కావడం సంతోషకరం. ఈ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. కంప్యూటర్ విద్య, ఆంగ్ల విద్య, ల్యాబ్ సదుపాయాలు ఉన్నాయి. పాఠశాలలో మొత్తం 16 మంది ఉపాధ్యాయులు, 373 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రత్యేక ఉపాధ్యాయుడితో బోధిస్తున్నాం.

– నర్సింహనాయక్, ఎంఈఓ, తిప్పర్తి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



జిగురు లక్ష్మీనర్సింహమూర్తి-కమల దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ జెడ్పీ హైస్కూల్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మరుగు దొడ్లు, పాఠశాల పూర్వ విద్యార్థి పురోహితుడు జిగురు లక్ష్మీనర్సింహమూర్తి తన తల్లిదండ్రులు అనంతలక్ష్మీ-నారాయణశర్మ జ్ఞాపకార్థం రూ.1.20 లక్షలతో నిర్మించిన కంప్యూటర్ గదిని, బడి బాట కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో ప్రస్తుతం 650 మందిపైనే పిల్లలు విద్యనభ్యసిస్తున్నారని, రాబోయే విద్యా సంవత్సరం వరకు 1000 మంది పిల్లలను ఎన్‌రోల్‌మెంట్ చేసేలా ఉపాధ్యాయులు లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ప్రజాప్రతినిధుల పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు సహకరిస్తానని అన్నారు. ఈ సందర్భంగా దాత పురోహితుడు లక్ష్మీనర్సింహమూర్తి-కమల దంపతులను ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం కోదాటి రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, ఎంఈఓ మేకల నాగయ్య, కౌన్సిలర్లు గద్దం స్వామి, యాసారపు లక్ష్మీ వెంకన్న, పోతుల సునీత రవీందర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న, ఉపాధ్యాయులు రామకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులతో డీఎస్పీ శివరాంరెడ్డి

రామగిరి(నల్లగొండ): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి అన్నారు. నల్లగొండలోని మౌంట్ ఫోర్ట్ సీబీఎస్సీ పాఠశాలలో నూతన విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం కొత్తగా ఎన్నికైన విద్యార్థి నాయకులు మార్చ్ ఫాస్ట్ చేసి జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పేరెంట్ కమిటీ మెంబర్ స్వర్ణన్, ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ బాల ఇన్నా, కరస్పాండెంట్ రెవరెండ్ బ్రదర్ హృదయ్‌కుమార్‌రెడ్డి, ఆర్థిక సలహాదారుడు రెవరెండ్ బ్రదర్ చాకో, బ్రదర్ పి.టి జోసెఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వనజీవి రామయ్యకు నివాళి

చిట్యాల: ఇటీవల మృతిచెందిన ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ వనజీవి రామయ్య కుటుంబాన్ని గురువారం చిట్యాల పట్టణానికి చెందిన కుమ్మరి కుల సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడూరి చంద్రం పరామర్శించారు. అనంతరం రామయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

నల్లగొండ : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని నల్లగొండ ఎంఈఓ అరుంధతి సూచించారు. పట్టణంలోని సావర్కర్‌నగర్‌లో గల అక్షర స్కూల్లో గురువారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల కళా ప్రదర్శనలు, ప్రసంగాలు, అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కక్కిరేణి లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ పోలోజు నాగేందర్, ప్రిన్సిపాల్ అనూష, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పోషణ్ అభియాన్



చండూరు : మాట్లాడుతున్న సీడీపీఓ అంజుమ్

నకిరేకల్ : ఆరోగ్యంగా ఉండాలంటే చిరు ధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ అంజుమ్, సూపర్‌వైజర్ భవాని సూచించారు. నకిరేకల్ మండలం ఓగోడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పలు సూచనలు చేశారు. బాలింతలు, చిన్నారులు రక్తహీనత లోపం అధిగమించాలంటే సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చిన్నారులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి, ఆరెగూడెం గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, చిన్నారులు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన సమతుల్యత ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నవనీత, కవిత, విజయ, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



చండూరు : అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లావణ్యకుమారి

పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం మేలు

చండూరు : పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో మేలు చేస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్యకుమారి, అదనపు సీడీపీఓ వెంకటమ్మ అన్నారు. గురువారం చండూరు, చామలపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోషణ పక్షం సమావేశాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆహారంలో అన్ని రకాల విటమిన్లు, లవణాలు, పిండి పదార్థాలు, ప్రొటీన్లు ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యాదమ్మ, సునీత, అంగన్‌వాడీ టీచర్లు, కార్యదర్శులు, ఆశా వర్కర్‌లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కట్టంగూర్‌లో బడిబాట కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంఈఓ అంజయ్య



శాలిగౌరారం : బైరవునిబండ గ్రామంలో ..

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ అంబటి అంజయ్య అన్నారు. బడిబాట కార్యక్రమాన్ని ముందస్తుగా గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల నుంచి కట్టంగూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొంక ఆంథోని, అబ్దుల్ గపూర్, శ్రీనివాసరెడ్డి, విఠల్‌కుమార్, చిన్ని శ్రీనివాస్, లోహిత్, ఇందిరాదేవి, సీఆర్‌పీ పాలగోని రవికుమార్ ఉన్నారు.

శాలిగౌరారం: బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ బైరవునిబండ గ్రామంలో గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సోమలింగయ్య, వెంకట్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, భాస్కర్, ఇస్మాయిల్, కల్పన పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

చండూరు : మండలంలోని శిర్దేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ బండారు యాదగిరి గురువారం తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనికి వస్తున్న కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టెంట్, మంచినీటి వసతి ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని సూచించారు. కనీస వేతనం అందేలా పనిచేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. అనంతరం అదే గ్రామంలో నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



దరఖాస్తులు సేకరిస్తున్న గోలి ప్రభాకర్

కట్టంగూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ విమర్శించారు. వికలాంగుల చైతన్యం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మల్లారం, బొల్లేపల్లి గ్రామాల్లో పర్యటించి వికలాంగుల నుంచి దరఖాస్తులను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు, ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన దివ్యాంగులకు అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సేకరించిన దరఖాస్తులను ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గాయత్రీ, నీలమ్మ, సరిత, సత్యనారాయణ, నాగరాజు ఉన్నారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణానికి హాజరైన భక్తులు

కనగల్ : మండల పరిధిలోని బుడుమర్లపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. గురువారం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా మండప పూజలు, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రాజాపేటతండాలో నిలిచిన చెత్త సేకరణ



రాజాపేటతండాలో నిలిచి ఉన్న ట్రాక్టర్

మర్రిగూడ : మండలంలోని రాజాపేటతండాలో రెండు నెలలుగా చెత్త సేకరణ నిలిచిపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీకి కేటాయించిన ట్రాక్టర్ ద్వారా పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో చెత్తను సేకరించకపోవడంతో తమ ఇళ్ల లోనే చెత్త కుప్పలుగా పేరుకపోయిందని ప్రజలు వాపోతున్నారు. వ్యర్థాలు నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రహదారుల పక్కన కూడా ఇతర వ్యర్థాలను వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పన్నులు చెల్లించినా..

గ్రామంలో ఎప్పటికప్పుడు పన్నులు చెల్లించినప్పటికీ చెత్తను తీసుకెళ్లడంలో పంచాయతీ సిబ్బంది జాప్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించకపోతే గ్రామ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. నెలల తరబడి పంచాయతీ కార్యదర్శితోపాటు ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కనీస మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకాధికారులు చొరవ చూపి తక్షణమే చెత్తను తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీఓ రవికుమార్‌ను వివరణ కోరగా సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

మౌంట్‌ఫోర్ట్ విద్యార్థినికి గిన్నిస్ బుక్‌లో చోటు

నల్లగొండ : పట్టణంలోని మౌంట్ ఫోర్ట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని రుధిరా జాయికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. గత సంవత్సరం డిసెంబర్ 1 న మిస్టర్ అగస్టీన్‌కు చెందిన హాలేలు మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో 1046 మంది విద్యార్థుల మధ్య పోటీ జరిగింది. విద్యార్థిని రుధిరా జాయి గంట వ్యవధిలో కీబోర్డు వాయించిన వీడియోను గిన్నిస్ బుక్ సంస్థకు అందజేశారు. దీంతో విద్యార్థినికి హైదరాబాద్‌లో గిన్నిస్‌బుక్ ప్రతినిధులు మెడల్, సర్టిఫికెట్ అందించారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం అభినందించారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

లక్ష్య సాధనకు విద్యార్థులు కష్టపడి చదవాలి

మర్రిగూడ : విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా లక్ష్య సాధన కోసం కష్టపడి చదవాలని ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ అన్నారు. గురువారం మర్రిగూడ ఆదర్శ పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదర్శ పాఠశాల పీఎంశ్రీకి ఎంపిక కావడంతో పాఠశాల అభివృద్ధికి అదనపు నిధులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి, ఉపాధ్యాయులు రజాక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రహణం మొర్రి పిల్లలకు ఉచితంగా శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ మహేష్

నార్కట్‌పల్లి : పుట్టుకతో వచ్చే గ్రహణం మొర్రి సమస్యతో బాధపడే పిల్లలకు కామినేని డెంటల్ కాలేజీలో ఉచితంగా అత్యాధునిక శస్త్ర చికిత్స అందించనున్నట్లు నార్కట్‌పల్లి కామినేని డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ తెలిపారు. గురువారం కాలేజీ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామినేని డెంటల్ కాలేజీ సామాజిక బాధ్యతలో భాగంగా చేపట్టిన కార్యక్రమం అని పేర్కొన్నారు.ఈ సమావేశంలో కామినేని మార్కెటింగ్ విభాగాధిపతి సత్యనారాయణ, పీఆర్‌ఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆక్రమించిన భూమి స్వాధీనం

నార్కట్‌పల్లి : రెండు కంపెనీల వారు సమీపంలోని భూమిని ఆక్రమించడంతో బాధితుడు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు నార్కట్‌పల్లి తహసీల్దార్ వెంకటేశ్వరావు గురువారం ఆక్రమణకు గురైన భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. వివరాలు.. మండలంలోని గోపలాయపల్లి గ్రామానికి చెందిన రామిడి గోపాల్‌కు గ్రామ శివారులో 30 గుంటల భూమి ఉంది. ఆ భూమి సమీపాన షీనా బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, అంపిల్ లైఫ్ సెన్సెస్, కంపెనీలు ఉన్నాయి. అయితే ఆ కంపెనీ యాజమానులు తన 15 గుంటల భూమిని ఆక్రమించారని గోపాల్ గ్రామస్తులతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠికి గత నెల ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్.. ఈ నెల 16వ తేదీన రామిడి గోపాల్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ సర్వేర్, ఏడీ, ఇండస్ట్రియల్ జీఎం, ఎండీ, రెండు కంపెనీల యాజమాన్యంతో విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్ వెంకటేశ్వరావు, సర్వేర్ శ్రీనివాస్, ఆర్ఐ భవానిలు కంపెనీ వారు ఆక్రమించిన భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి, ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేశారు.



హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కొనుగోలు కేంద్రం ప్రారంభం

చండూరు : మండలంలోని పుల్లెంల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చండూరు తహసీల్దార్ దశరథ నాయక్ గురువారం ప్రారంభించారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

నిప్పు.. వరి పంటకు ముప్పు



వరి కొయ్యలను కాల్చుతున్న రైతులు

కనగల్ : పంట చేతికి రాగానే రైతులు మరో పంట సాగు చేసే పనుల్లో బిజీ అవుతారు. అయితే భవిష్యత్ నష్టాలను అంచనా వేయకుండా రైతులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. వరి పంట పూర్తయ్యాక గ్రాసాన్ని పశువులు ఉన్న రైతులు మాత్రమే నిలువ చేసుకుంటుండగా మిగతా రైతులు మాత్రం పొలంలో కాల్చేస్తున్నారు. ఇంకా మొక్కజొన్న రైతులు పూర్తిగా పంట పొలంలోనే దహనం చేస్తున్నారు. పంటల వ్యర్థాలకు నిప్పుపెట్టకూడదని వ్యవసాయ శాఖ మండల ఏఓ బెజవాడ అమరేందర్‌గౌడ్ చెబుతున్నారు. రైతులకు సలహాలు సూచనలు ఆయన మాటల్లోనే..

భూమిలో కలియదున్నాలి..

పంట పూర్తయ్యాక వరి పొలంలోనే కలియదున్నడం వల్ల నేలలో సేంద్రియ కర్బన శాతం పెరగడంతోపాటు సుమారు ఎకరాకు టన్ను ఎరువు తయారవుతుంది. తద్వారా సుమారు 5 నుంచి 10 శాతం దిగుబడి పెరిగే అవకాశం ఉంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్పేట్ చల్లితే పంట అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా రూపాంతరం చెంది పంటకు సేంద్రియ ఎరువుగా మారుతుంది. దాని ద్వారా పంటలో డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. అంతేకాకుండా మొక్కలకు రెండు శాతం నత్రజని 4 శాతం పాస్పరస్ అదనంగా లభిస్తుంది. జింక్, మాంగనీస్, కాల్షియం, ఐరన్ వంటివి అంది పంటకు మేలు చేకూర్చడంతోపాటు నీటి నిల్వ పెరుగుతుంది. పొలం దున్నే ముందు ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్ఫట్‌ను చల్లితే సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచుకునే అవకాశం ఉంటుంది.

పంట దిగుబడి తగ్గిపోతుంది

వరి కొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల వాతావరణం కాలుష్యం పెరగడంతోపాటు అత్యధిక ఉష్ణోగ్రతతో భూసారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా భూమిలో ఉండే నత్రజని, పాస్పరస్ వంటి పోషక పదార్థాలతోపాటు పంట దిగుబడి తగ్గిపోతుంది. అలాగే భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కూడా కాలిపోతాయి. అంతేకాకుండా పంటకు మేలు చేసే ఖనిజ లవణాలు కాలిపోవడంతోపాటు సూక్ష్మజీవులు చనిపోతాయి.